

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**ఇవాళ సాయంత్రం మొదటి క్లాసు**. కాస్త భయంగా ఉంది. మన ఇండియాలోలాగాకాక సాయంత్రం 5కి ఒక్క క్లాసు మాత్రమే. క్లాసుకి జీన్స్, టీ షర్ట్ వేసుకోవాలని హనీష చెప్పింది. ఇప్పటిదాకా చుడీదార్ మాత్రమే వేసుకున్నాను. దాంతో తెలీని ఇబ్బంది మొదలవుతోంది. "క్లాస్ ఏ బిల్డింగ్‌లో ఉంది?" అని హనీషని అడిగాను.

"చూపిస్తా, రా" అంది.

దాంతో ఇద్దరం కాంపస్‌కు బయలుదేరాం. ఇదివరకులాకాక చాలామంది ఉన్నారు. కొంతమంది ఫార్మల్స్ వేసుకున్నారు. మరికొంతమంది షార్ట్స్ వేసుకున్నారు. సూట్ వేసుకున్న వారు ప్రొఫెసర్స్ అని భావించాను.

"కామ్ గా ఉన్నావేంటి?" హనీష అడిగింది.

"ఏంలేదు."

"టెన్షన్ పడుతున్నావా?"

"లేదు.

"ఫస్ట్‌డే అలానే ఉంటుంది. కానీ ఏంకాదు. భయపడకు."

తలూపాను.

"మీ క్లాస్ మేట్స్ ఎవరైనా పరిచయమయ్యారా?"

"లేదు."

"నీ డిపార్ట్‌మెంట్‌కి ఎవరెవరు వచ్చారు?"

"తెలీదు."

"నీక్లాస్‌లో ఎంతమంది ఇండియన్స్?"

"ఏమో?"

"ఫరవాలేదులే. డోంట్ వర్రీ. నేను కనుక్కుంటా."

"థాంక్స్."

"ఇదే బిల్డింగ్" చూపించింది.

"ఓకే. థాంక్స్ హనీష"

"దీనికి థాంక్స్ అక్కర్లేదు. లోపలికి వెళ్ళి చూస్తావా?"

"అక్కర్లేదులే. సాయంత్రం ఒకటేసారి వెళ్తాను"

"సరే"

కేంపస్‌లోకి నడవసాగాము. ఎక్కడికి వెళుతున్నామో తెలీదు. అడగాలని కూడా లేదు.

క్లాసులో ఎవరెవరు ఉన్నారో తెలుసుకోవాలనే ఆలోచన కూడా నాకు రాలేదు.హనీష ఉందికాబట్టి సరిపోయింది కానీ లేకపోతే ఎంత ఇబ్బంది పడేదాన్నో ఊహించుకోవడానికే భయంగా ఉంది.

"అర్జున్‌కి మెసేజ్ చేసాను. లైబ్రరీ పక్కన బిల్డింగ్లో ఉన్నాడట. వెళ్దామా?" అడిగింది.

నిజానికి ఇంటికి వెళ్ళి ఏడవాలని ఉంది. కానీ తప్పక "సరే" అన్నాను.

"తన క్లాస్ మొదలవడానికి ఇంకా పది నిమిషాలే ఉందట. ఫాస్ట్‌గా వెళ్ళాలి" అంటూ పరిగెత్తింది. తన వెనక నేనూ పరిగెత్తసాగాను. వెనక్కి తిరిగి "ఫాస్ట్‌గా రా" అంది.

నాకు కుదిరినంత వేగంగా పరిగెత్తాను. చుట్టుపక్కల వాళ్ళు చూస్తున్నారని మొదట్లో అనిపించినా, హనీష నుండి తప్పిపోతానేమో అని వేగంగా వెళ్ళాలన్న ఆలోచనలో మునిగి తేలాను. రెండు నిమిషాలలో ఆ బిల్డింగ్ చేరాము. ఇద్దరం ఆయాసపడుతూ  నవ్వుకుంటూ లోపలికి వెళ్ళాము. ఆ నవ్వుతో ఊపిరి తీసుకోవడం ఇంకా ఇబ్బందిగా అనిపించింది.

"ఎక్కడినుండి వస్తున్నావు? ఇంత ఆయాసపడిపోతున్నావు?" ఒకతను హనీషని అడిగాడు.

"జార్డన్ హాల్ నుంచి" నవ్వాపుకుని చెప్పింది హనీష. ఒక రెండు సెకండ్ల తరవాత "తన పేరు అవని. నా టెంపరరీ రూమ్మేట్"

"ఓ నువ్వేనా అవని? నిన్ను లైబ్రరీలో చూసాను" అన్నాడు.

"హాయ్" ఏమనాలో తోచక అన్నాను.

"ఇతను అర్జున్. తనకి అందరూ తెలుసు. ఎవరు ఏ క్లాస్ తీసుకున్నారు, ఎక్కడ ఉంటున్నారులాంటివి ఇతనిని అడిగితే సరిపోతుంది."

చిన్నగా నవ్వాను, అతను గర్వంగా నా వైపు చూసాడు.

"డైనమిక్స్ ఆఫ్ ఏరో స్పేస్ ఎవరెవరు తీసుకుంటున్నారో తెలుసా?" అడిగాను.

"డైనామిస్" సాగదీస్తూ "ఎప్పటికల్లా కావాలి?"

"ఎంత తొందరగా అయితే అంత బెటర్"

"సరే. క్లాసుకి వెళుతున్నా. క్లాస్‌లోంచి మెసేజ్ చేస్తా" అన్నాడు.

థాంక్స్ చెప్పి నేను, హనీష వెనక్కి బయలుదేరాం. ఈలోగా అతని నుండి మెసేజ్ వచ్చిందని హనీష చెప్పింది.

ఆతృతగా "ఏమన్నాడు?" అడిగాను.

"నిఖిల అని ఎవరో తీసుకుంటుందట" అంది.

"ఓకె."

"తను సెకండ్ సెమిస్టర్ అట."

"ఓకె."

"మీ డిపార్ట్‌మెంట్ కాదట."

"ఓకె"

"ఏదో టైప్ చేస్తున్నాడు... నీ నంబర్ ఇవ్వాలా అని అడుగుతున్నాడు."

"యా ఇవ్వమను" నా గొంతులో కుతూహలం స్పష్టంగా తెలిసింది.

ఇల్లు చేరే సమయానికి నిఖిల అనే అమ్మాయి నాకు ఫోన్ చేసింది. సాయంత్రం క్లాసుకి ముందు మా ఇంటికి వస్తానని, ఇద్దరం కలిసి వెళదామని చెప్పింది. సరే అన్నాను. మాటలు బట్టి మంచమ్మాయిలాగా అనిపించింది. ఆ అమ్మాయి, నేను ఫ్రెండ్స్ అయితే ఇంక ఈ క్లాసు గురించి బెంగ అక్కర్లేదు అనుకున్నాను. జరిగిన సంభాషణ హనీషకి చెప్తుండగా పొద్దున కలిగిన దిగులు ఇప్పుడు లేదని అర్థమైంది.

అటూ ఇటూ చూస్తుండగానే సాయంత్రం అయింది. కాస్త తడబడుతూ

"హనీష, ఒక హెల్ప్ కావాలి" అడిగాను.

"చెప్పు" ఆశ్చర్యంగా చూసింది.

"క్లాస్‌కి ఎం వేసుకోవాలో చెప్తావా?" అడిగాను.

చిన్నగా నవ్వుతూ "ఇది వేసుకో" ఒక పింక్ టీ షర్ట్‌ని నా సూట్‌కేస్‌లోంచి తీసింది.

"బానే ఉంటుందా?"

"యా. బావుంది. అందరూ ఇలాంటివే వేసుకుంటారు."

"సరే."

"ఫస్ట్‌లో ఇలానే ఉంటుంది. తరువాత అలవాటైపోతుందిలే."

"సరే."

"నేను రెడీ చెయ్యనా?"

"యా. చెయ్యవా, ప్లీజ్."

టకటక దువ్వెన తెచ్చి నాకు రెండు పిలకలు వేసింది.

"నేనేమన్నా స్కూలికి వెళుతున్నానా?"

"ష్. మాట్లాడకు" అంటూ మొహానికి క్రీం పూసి, కళ్ళకి కాటుక పెట్టింది ఆ తరవాత "లిప్‌స్టిక్ వేసుకో" అంది.

"ఒద్దు" అన్నాను.

"అదేంటి? లిప్‌స్టిక్ వేసుకోవా?"

"లేదు. క్లాస్‌కి మేకప్ ఎందుకు?"

"ఇక్కడ అందరూ అలానే వెళతారు. కొంచెం నీట్‌గా రెడి అవ్వాలి. ఇండియాలోలాగా పిచ్చి పిచ్చిగా వెళ్ళకూడదు. ప్రొఫెసర్స్‌కి బేడ్ ఇంప్రెషన్ వస్తుంది."

"సరే" తను చెప్పింది నిజమా, అబద్ధమా అర్థంకాక, అన్నయ్యని అడుగుదామని బయటికి వెళ్ళి ఫోన్ చేసాను. 'బి ప్రెజెంటబుల్' అన్నాడు.

హనీష చెప్పింది నిజమే. కానీ లిప్‌స్టిక్ వేసుకోలేదు. ఇవాల్టికి కాటుక మాత్రం చాలు అని చెప్పాను. లాప్ టాప్‌ని, ఒక నోట్ బుక్‌ని క్లాసుకి తీసుకెళ్ళమంది.

అలానే బేగ్ సర్దుకున్నాను. టెక్స్ట్ బుక్ లేకుండా మొదటిసారి క్లాసుకి వెళ్ళడం. కాస్త ఇబ్బందిగా అనిపించింది.

ఇంతలో నిఖిల వచ్చి పరిచయం చేసుకుంది. ఇద్దరం కలిసి క్లాసుకి బయలుదేరాము. తను పెట్టుకున్న పెద్ద పోగులు చూసి, నా కాటుక కన్నా భారీగా ఉన్నాయి అనుకున్నాను.

"నేను ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్. ఎలా ఉంటుందో చూద్దామని ఈ క్లాస్ తీసుకుంటున్నాను" అంది.ఎలక్ట్రికల్ వాళ్ళు ఏరో స్పేస్ సబ్జెక్ట్ తీసుకోవచ్చా అని ఆశ్చర్యపోయాను. ఒక లాలీపాప్ చేతికిచ్చింది.

"క్లాసులో ఆకలేస్తుంది. ఇది తిను" బలవంతం చేసింది.

నేను ఆలోచించకుండా తెరిచి నోట్లో పెట్టుకున్నాను. ఆఖరిసారి నేను లాలీపాప్ తిని పదేళ్ళపైనే అవుతుంది. క్లాసు చేరాము కానీ లాలీపాప్ పూర్తవ్వలేదు. "డస్ట్‌బిన్" ఎక్కడ ఉంది?" అడిగాను.

"ఏంకాదు. ఇక్కడ క్లాసులో అందరూ తింటారు" అని ధైర్యం చెప్పింది. లోపలికి వెళ్ళేసరికి ప్రొఫెసర్ ఉన్నారు.

"ఎక్స్క్యూజ్‌మీ, మే అయ్ కమిన్?" అడిగాను.

క్లాసులో అందరు తలతిప్పి నన్ను చూసారు. నిఖిల లోపలికి నవ్వుతూ వెళ్ళిపోయింది .ప్రొఫెసర్ ఇండియన్. నవ్వి "యస్...యస్" అన్నారు.

చేతిలోని లాలీపాప్ నోట్లో పెట్టుకుని భుజాలనుండి బాగ్ తీసి నిఖిల పక్కన కూర్చున్నాను. అందరూ ఇంకా నన్నే చూస్తున్నారు. సిగ్గుతో నోట్‌బుక్‌లో చూస్తూ ఉండిపోయాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story